# కక్కుర్తి

ఆఫీసులో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాను. సీలమండల మీద ఏదో దురదగా వుంది. కొంచెం గోకాను. చెమ్మగా వుంది. మళ్ళీ గోకాను. ఇంకా చెమ్మగా వుంది. అంతే! గోళ్ళు గిల్లుకోవడం మానేసి గోకుతూ కూర్చున్నాను. గోకినకొద్దీ చెమ్మగా వుంది. చెమ్మగా వున్న కొద్దీ గోకుకున్నాను. ఈ "బ్రహ్మానందం" యిలా అనవరతంగా సాగుతుండగా, "తొలి సంకల్ప వికారం" అల్లే ఆఫీసు గడియారం టంగు టంగున మ్రోగసాగింది. ఒకసారి గడియారం కేసి దృష్టి సారించి మళ్ళీ కాలికేసి తలతిప్పాను. "అమ్మబాబోయ్, కాలి మీద ఏదో పుండు?" మధ్యక్కోసిన బీట్రూట్ దుంపలాగా వుంది. అమాంతం సీటులోంచి అదృశ్యమై పోయి మా డాక్టరు బావ ప్రకాశం దగ్గర ప్రత్యక్షమయ్యాను.

"ఏమిటి ఇలా తగలడ్డావ్?" అన్నాడు వాడు.

"నేను కాదు తగలడింది. నా కాలు..చూడు" అంటూ పాదం ఎత్తి వాడి టేబుల్ మీద పెట్టాను. వాడు కాస్సేపు దానికేసి పరీక్షగా చూసి " నా నెత్తిమీద పెట్టబోయినావ్!" అన్నాడు. "అలాగే" అంటు నేను ఆ పాదం మరికాస్త ఎత్తి త్రివిక్రముణ్ణి అవబోయేంతలో "ఆగక్కడ" అంటూ వాడొక అరుపు అరచి శ్రీనాథ సీసమో, విశ్వనాథ శార్దూలమో, నాశ్రాద్ధమో ఏదో ఓ పద్యభాగం చదివాడు.

నాకు దురదగా ఉండి మళ్ళీ గోకుతూ, "సాహిత్యం ఎప్పటినుంచి ఏడుస్తున్నావ్" అని అడిగాను.

వాడు, "గోకకు" అంటూ నా చెయ్యి ఒక్క గుంజు గుంజి "సాహిత్యం ఏమిటి నీ బొంద" అన్నాడు.

"మరి ఇప్పుడు నువు చదివిన ఆ శ్లోకం ఏమిటిట?" అని అడిగాను.

"అదా? అది శ్లోకం కాదు. నీకొచ్చిన చర్మరోగం చిట్టితండ్రీ! దాన్ని "లాటిన్" లో అలా పిలుస్తారులే" అన్నాడు. నాకు లాఠీలతో కొట్టినట్లయింది.

భోరుమంటూ వాడి మీద పడిపోయి, "అంత పెద్ద రోగమా" అని వెక్కసాగాను.

వాడు "ఛీఛీఛీఛీ! వెధవా! లేలే! చొక్కా తడిపేస్తున్నావా" అంటూ కసురుకుని, ప్రస్తుతం అంత పెద్దది కాదు. నవ్వు అశ్రద్ధ చేస్తే అవుతుంది". అని అప్యాయంగా అని, ఓ చీటీ మీద ఏదో బరికేసి నాకిస్తూ, "దార్లో ఈ ట్యూబు కొనుక్కుని యింటికెళ్ళి రాసి పడుకో, ఇవ్వాళే మొదలట్టు. రోజూ రెండు పూటలా రాయి. అయిదారునెలలు వాడితేగాని తగ్గదిది. ఇది కొంచెం ఖరీదు. ఈసారి కక్కుర్తి పడక కొనుక్కో. నాదగ్గర "శాంపిల్స్" అయిపోయినాయ్! సోమవారం వస్తాయి. యిస్తాను. ఈలోగా అశ్రద్ధ చేసి చావకు. రోగం పెరిగి ఛస్తుంది. తర్వాత ఛస్తావ్, పో" అని ఏకబిగిన నా చెవులలో అరిచేసి, ఓ గ్లాసు మంచినీళ్ళు తాగి, నాకేసి చూసి, ఏమిటి! యింకా యిక్కడే తగలడ్డావా? పోపో! ముందు, అన్నట్లు ఆగు! మా ఆవిడ రాత్రికి ఊరు వెళుతోంది. ఎల్లుండొస్తుంది. రేపు నేను మీ యింట్లోనే భోజనం, మా చెల్లాయితో చెప్పు, ఏ చెల్లాయ్‌తో చెప్తావ్, నాకు ముగ్గురు చెల్లెళ్ళున్నారు. మీ ఆవిడతో చెప్పు. పో పో అంటూ నన్ను తరిమేసి "నెక్ట్స్" అని కేకేసాడు. వెధవ ప్రాక్టీసూ వీడూనూ – వెధవ! కొంపలంటుకుపోతున్నట్టే.

దారిలో ఓ మెడికల్‌షాపు దగ్గరాగి, వాడు బరికిన చీటీ చూపించాను. షాపువాడు ఓ చిన్న ప్యాకెట్టు టేబుల్ మీదికి విసురుతూ దాని ధర చిన్నగా అరిచాడు. నాగుండె చెరువై పోయింది ఆ ధర విని. పోనీ సోమవారం దాకా ఆగుదామా అనిపించింది. ఇంతలో "కక్కుర్తిపడి చావకు, రోగం పెరిగి ఛస్తుంది. తర్వాత ఛస్తావ్" అంటూ మా ప్రకాశం గాడి అరుపులు చెవులో గింగురుమన్నాయి. ఉలిక్కిపడి భారంగా చెయ్యి జేబులోకి పోనిచ్చాను. ఈలోగా ఆ మందు పెట్టె మీద, కండ సంపాదకుడి బండ సంతకం వల్లే ఆ మందు తయారుచేసే కంపెనీ పేరు కనబడింది. జేబులోకి వెడుతున్న చెయ్యి, "ఫ్లయింగ్ సాసర్" అల్లే బయటికొచ్చేసింది.

ఔను! రామకృష్ణ ఈ కంపెనీలోనే కదా మెడికల్ రిప్రజంటేటివ్! వాడిదగ్గర "ఫిజీషియన్ శాంపిల్స్" చాలా ఉంటాయి. ఓటి తీసుకుంటే పోలా. ఎందుకూరికే యింత డబ్బు దండగ. అంతగా అయితే అప్పుడే వచ్చి కొనుక్కోవచ్చు.

"ఇప్పుడే వస్తా" అని షాపువాడితో చెప్పి రామకృష్ణ ఇంటికి పరిగెత్తాను. సరిగ్గా వాడూ అప్పుడే రిక్షా దిగుతున్నాడు. క్యాంపు నుండి వస్తున్నాడు. వాడు స్నానం చేసి బట్టలు మార్చుకుని బడలిక తీర్చుకుని ఇవన్నీ పూర్తయ్యేటప్పటికి చాలాసేపు పట్టింది. చివరికి వాడికి ప్రకాశం బరికిన చీటీ చూపించాను. వాడు ఆ కాగితం చిరిగిపోయేటట్లుగా ఓ పెద్ద అంబోతల్లే నిట్టూర్చి "ఇదే కావల్సొచ్చిందా నీకు" అంటూ ఓ అరగంట ఆ సంచులూ, ఈ సంచులూ, ఆ పెట్టెలూ, ఈ పెట్టెలూ వెదికి చివరకి ఆ మందుపెట్టె ఒకటి తీసుకుని వచ్చి ఇదొక్కటుంది బాబాయ్ నీఅదృష్టం కొద్దీ ఇది. చాలా 'ఓల్డ్ ప్రొడక్ట్'. మాకు 'శాంపిల్స్' ఎక్కువగా రావు. ఐనా నాల్గయిదు రోజుల్లో వస్తాయిలే యిస్తాను. ఈలోగా ఇది వాడుతూ ఉండు" అంటూ యిచ్చాడు.



వాడికో "థ్యాంక్స్" పారేసి మరో అరగంట వాడితో ఊకదంపి, ఇంటికి బయలుదేరాను ఆనందంగా.

రాత్రికి భోంచేసి మంచం ఎక్కి ట్యూబు తీసాను. రాద్దామని తీరా పెట్టెలోంచి బయటికి తీస్తే, ఆ ట్యూబెంతుంది. మల్లెపువులో మంచు బిందువంత.

మెల్లిగా దాని మూత తీసి, దాని మూత కుడిచేత చూపుడు వేలు మీద ఆనించి, ఎడం చేత్తో ట్యూబు క్రింద మెల్లిగా నొక్కాను. అయింటుమెంటు రాలేదు. మరికాస్త నొక్కాను. ఊఁహూ! మరికాస్త ఊఁహూ! "వీడి కక్కుర్తి తగలెయ్య! సగమే నింపాడేమిటి ట్యూబు" అని అనుకుంటూ మరికాస్త గట్టిగా వత్తాను. ఏముంది "బుస్" మంటూ మరికాస్త గాలి, ఓ చిన్నబుడగ. అప్పటికే ట్యూబంతా అయిపోయింది. ఆ మెడ దగ్గర మాత్రం కాస్త మిగిలింది. ఒళ్ళు మండిపోయి రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుని రాక్షసుడల్లే ఆ మెడ దగ్గర పిసికేశాను, అంతో యింతో కొంచెం ఉంటే బయటికి వస్తుంది కదా అని.

అంతే! ఆ దెబ్బలకి ఓ పెసర గింజంత ఆయింట్‌మెంట్ సన్నతీగలాగా సాగి, "పుఛుక్" మంటూ ఎగిరి ప్రక్కనే టేబుల్ మీద తిరుగుతున్న "మోహిని ఫ్యాన్" లోకి వెళ్ళిపోయింది. అది కాస్తా ఆకాస్తనీ, గోడమీది దేవతలకి అమృతం లాగా పంచేసింది.